క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష సీఎంవో ప్రభాకరరావు

రణస్థలం: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా సమగ్రశిక్ష సీఎంఓ పేడాడ ప్రభాకరరావు పిలుపునిచ్చారు. రణస్థలం మండల పరిషత్ కార్యాలయంలో 108 ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, పేరెంట్ కమిటీ చైర్మన్లకు బడుల్లో మౌలిక వసతుల కల్పనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వసతి సౌకర్యాలపై ముందస్తు ప్రణాళిక ఖచ్చితంగా ఉండాలన్నారు. ఈ విషయంలో స్కూల్ కమిటీ చైర్మన్లు పాత్ర కీలకమని చెప్పారు. అనంతరం ఎస్ఎంసీ చైర్మన్ల విధి విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఏ.త్రినాథరావు, కోర్సు డైరెక్టర్ బి.లావణ్య, పరిశీలకులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న భజన మండలి సభ్యులు

గార: బూరవిల్లి గ్రామానికి చెందిన డిక్కల శశాంక్ కిడ్నీ, పెద్ద పేగుకు సంబంధించిన వ్యాధితో దీర్ఘకాలంగా బాధపడుతూ ఆర్థిక అవసరాలకు ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న బోరవానిపేట సత్యసాయి భజన మండలి సభ్యులు రూ.50 వేలు సమకూర్చి గురువారం శశాంక్ తల్లికి అందజేశారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ నరసింహా రౌలే, సేవాదళ్ కన్వీనర్ బి.సింహాచలం మాస్టర్, ఎం.జనార్దన్, జి.ధర్మారావు, ఎం.గోపి, బి.రాజశేఖర్, జగన్నాథం, ఎం.మాధవనాయుడు, అయ్యప్పలనాయుడు, జి.జగదీష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసకావద్దు



చింతువలస యువతతో మాట్లాడుతున్న ఎస్ఐ జనార్దనరావు

గార: మత్తు పదార్థాలకు యువత బానిసకావద్దని, జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని గార ఎస్ఐ రెల్ల జనార్దనరావు అన్నారు. గురువారం శ్రీకూర్మం పంచాయతీ చింతువలసలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మద్యం కలిగి ఉంటే అరెస్టులు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. డిజిటల్ అరెస్ట్ అంటూ వస్తున్న ఫోన్లను నమ్మవద్దన్నారు. ఈవ్‌టీజింగ్, మద్యం సేవించి బైక్‌లు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు.

కుమారరాజుకు తెలుగువెలుగు పురస్కారం



బుర్రి కుమారరాజు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమారరాజుకు తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక పురస్కారం లభించింది. ఇటీవల నిర్వహించిన పోటీల్లో 2024కు వీడ్కోలు పలుకుతూ 2025కి స్వాగతం పలుకుతూ రాసిన కవితను మెచ్చి జాతీయ కవితా వేదిక అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎస్.ఎన్.మూర్తి, ప్రధాన సలహాదారు కె.దాలినాయుడు, ప్రధాన కార్యదర్శి బి.హెచ్.వి.రమాదేవి, మీసాల గౌరినాయుడు, పైడి నవనీత రవీంద్రర్‌లు ప్రశంసాపత్రం, పురస్కారాన్ని అందజేశారని గురువారం పేర్కొన్నారు.

వినికిడి పరికరం వితరణ



కీర్తనకు వినికిడి పరికరం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్:లావేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక కీర్తనకు ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ వ్యవస్థాపకుడు నంది ఉమాశంకర్ వినికిడి పరికరాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, లయన్ డాక్టర్ పి.సింధూరలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో నిమగ్నమవుతున్న బొట్టా సాయికుమార్, నంది ఉమాశంకర్, ఉర్లం శివతేజలను అభినందించారు. శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఖ్యాతి ఫౌండేషన్ ప్రతినిధి ఆర్.శ్రావణి, సుసరాపు శ్రీలత, నిక్కు అప్పన్న, పీవీఆర్ఎం పట్నాయిక్, బి.జగదీష్, లలిత, సాయి సుధాక పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం



కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

- పండగ వేళ.. నిత్యావసరాల ధరల గోల
- మండుతున్న వంటనూనె ధరలు
- పప్పులు, కూరగాయలదీ అదే దారి
- అల్లాడుతున్న సామాన్య మధ్య తరగతి ప్రజలు

ఎచ్చెర్ల: పండుగ వేళ నిత్యావసర సరుకుల ధరలు మోత మోగుతుండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అల్లాడుతున్నారు. పప్పులు, కూరగాయలు, వంటనూనెలు, పండ్లు.. ఇతర సరుకుల ధరలు సామాన్యులకు అందనంతగా పెరిగిపోయాయి. ఎన్నడూ లేని విధంగా మండిపోతున్నాయి. దీంతో నిత్యావసర సరుకులను ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. సంక్రాంతి పండగ సమీపిస్తుండటంతో పెరిగిన నిత్యావసరాల ధరల కారణంగా ప్రతి కుటుంబంపై అదనంగా రూ. 5 వేల నుంచి రూ. 10 వేలు అదనపు భారం పడుతుందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

పౌష్టికాహారానికి దూరం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎచ్చెర్ల నియోజకవర్గంలో లక్షకు పైగా కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 90 శాతం కుటుంబాలు పేద, మధ్యతరగతి కుటుంబాల వారే. వీరి సగటు ఆదాయం నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలలోపే. గతంలో ఒక కుటుంబానికి నిత్యావసరాలు, కూరగాయలు, పాలకు కలిపి రూ.10 వేల వరకూ ఖర్చు అయ్యేది. ఇదే క్రమంలో పెరిగిన నిత్యావసర ధరల కారణంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది. దీంతో సామాన్యులు తమ ఆదాయ వనరుల ప్రకారం ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది పౌష్టికాహారానికి దూరమవుతున్నారు.

కాగుతున్న వంటనూనెలు



పండుగ వేళ వంట నూనెల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో ప్రజలు అల్లాడుతున్నారు. రిఫండ్ ఆయిల్ ప్యాకెట్ లీటరు రూ.140 నుంచి రూ.150 పలుకుతోంది. పిండి వంటలకు అధికంగా వినియోగించే పామాయిల్ లీటర్ ప్యాకెట్ ధర రూ.125 నుంచి రూ.135 పలుకుతోంది. గతేడాది పండగకు రిఫైండ్ ఆయిల్ లీటర్ ప్యాకెట్ ధర రూ.115 నుంచి రూ.118 వరకు ఉండేది. పామాయిల్ ప్యాకెట్ రూ.105 నుంచి రూ.110 వరకు ఉండేది. దీనికి భిన్నంగా ఈ ఏడాది సంక్రాంతికి వంట నూనె ధరలకు రెక్కలు రావడంతో వినియోగదారులు తల్లడిల్లుతున్నారు.

దిగిరాని పప్పుల ధరలు..



నిత్యావసర ధరలు పెరగడంతో మార్కెట్ వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఏ కూరగాయ ధర చూసినా కిలో రూ.40 తగ్గడం లేదు. ఉల్లిపాయలు కిలో రూ.40 నుంచి రూ. 50 ధర ఉంది. కంది, మినప, పెసర, శనగ వంటి పప్పు దినుసులు కిలో రూ.150 నుంచి రూ.190 పైకి చేరింది. మార్కెట్‌లో కంది పప్పు నాణ్యత ఆధారంగా కిలో రూ.150 నుంచి రూ. 170 వరకూ ఉంది. మినుములు కిలో రూ.120 నుంచి రూ.160 వరకూ విక్రయిస్తున్నారు. పెసరపప్పు కిలో రూ.110 నుంచి 150 వరకూ అమ్ముతున్నారు. శనగపప్పు ధర రూ.120 పైనే. వేరుశనగ కిలో రూ. 120 నుంచి రూ.140 వరకూ ఉండగా.. వెల్లుల్లి కిలో రూ.350కు తగ్గడం లేదు.

రూ.5 వేలు అదనపు భారం..



నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు పెరిగిపోయాయి. దీంతో నెలకు అదనంగా రూ.5 వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పెరిగిన ధరల కారణంగా ఖర్చు రెట్టింపు కావడంతో కూరగాయలు, పప్పులు తక్కువగా కొనుగోలు చేస్తున్నాం.

– బి.దాలినాయుడు, గొల్లపేట, ఎచ్చెర్ల మండలం

ధరలు పెరిగాయి



ఎన్నడూ లేని విధంగా మార్కెట్లో అన్ని నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయాయి. ఆదాయం తక్కువ, ఖర్చు ఎక్కువ పరిస్థితి నెలకొంది. దీంతో ఏమీ కొనలేకపోతున్నాం. దీంతో ఏమీ కొనలేకపోతున్నాం. కూరగాయలు, ఉల్లిపాయల ధరలు భయపెడుతున్నాయి.

– గొర్లె దమయంతి, గృహిణి, మురపాక, లావేరు మండలం

ఇవేం గ్రామసభలు?

గార: మండలంలో నిర్వహిస్తున్న గ్రామసభల తీరు అపహాస్యంగా ఉందని ప్రజాపరిరక్షణ సమితి సభ్యులు ముంజేటి బాబు సాయిరాం, యు.వెంకటరమణ అన్నారు. గురువారం గారలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఏడాదికి మూడు గ్రామసభలు నిర్వహించడం, సభకు ప్రత్యేకాధికారి పర్యవేక్షణ, అన్ని శాఖల సమన్వయంతో ప్రజాసమస్యలు తెలుసుకోవడం వంటివి చేయాల్సి ఉన్నా అవేమీ అమలు కావడం లేదన్నారు. అంబళ్లవలస, అంపోలు, బూరవెల్లి, కళింగపట్నం, తూలుగు, నిజామాబాద్, బోరవానిపేట, పూసర్లపాడు, శ్రీకూర్మం, వత్సవలసలో గురువారం తూతూమంత్రంగా గ్రామసభలు నిర్వహించి ప్రత్యేకాధికారులు హాజరు కాకుండా, సచివాలయ సిబ్బందితో జరిపించి ముగించేశారని చెప్పారు. గ్రామాల్లో కనీసం దండోరా కూడా వేయలేదన్నారు. కొన్ని పంచాయితీల్లో వార్డు మెంబర్లకు కూడా సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. పీజీఆర్ఎస్‌లో గ్రామసభల నిర్వహణ తీరుపై దరఖాస్తు చేసినా మండలంలో తీరు మారలేదని, దీనిపై మరోసారి కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

సేవాభావం అలవరుచుకోవాలి



అతిథులకు జ్ఞాపికలందజేస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం రూరల్: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నైరా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.భరతలక్ష్మీ కోరారు. కె.మన్నయ్యపేటలో గురువారం జాతీయసేవా పథకం శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ ప్రతి వలంటీర్ సమాజసేవలో కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఆర్.వి.వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా మోహన్‌సాయి

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్ఠాత్మక ఆలిండియా జూనియర్స్ ర్యాంకింగ్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు అంపైర్‌గా జిల్లాకు చెందిన సంపతిరావు మోహన్‌సాయినాథ్ నియామకమయ్యారు. ఈ పోటీలు ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్ వేదికగా జరగనున్నాయి. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి నియామక ఉత్తర్వులు అందుకుని, పోటీల కోసం గురువారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. మోహన్‌సాయి తండ్రి, ఫిజికల్ డైరెక్టర్ సంపతిరావు సూరిబాబు అంతర్జాతీయ రిఫరీగా గుర్తింపు పొందిన విషయం తెలిసిందే.

5న చౌదరికి ఆత్మీయ సత్కారం



మాట్లాడుతున్న సాయిరాం తదితరులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5న ఉదయం 10.30 గంటలకు శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులోని బృందావన్ ఫంక్షన్ హాల్‌లో చౌదరి పురుషోత్తమనాయుడు ఆత్మీయ అభినందన సభ నిర్వహిస్తున్నామని ఏపీ ఎన్‌జీవో సంఘ ఆహ్వాన కమిటీ సభ్యులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాస్, ఆర్.వేణు తెలిపారు. శ్రీకాకుళం ఎన్‌జీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖలో గూడ్స్ సర్వీస్ టాక్స్ అధికారిగా, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం సేవలందించిన పురుషోత్తంనాయుడు డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ చేశారని చెప్పారు. ఆత్మీయ సభకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.వి.శివారెడ్డి, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రజా ఉద్యమ పితామహుడు చౌదరి తేజేశ్వరరావు, సంపూర్ణమ్మ దంపతులు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్‌జీవో సంఘ నాయకులు బడగల పూర్ణచంద్రరావు, కాయల శ్రీనివాసరావు, ఆర్‌వీఎస్ శర్మ, బొత్స శ్రీనివాసరావు, శ్రావణి, హైమవతి, జయరావు, రాధాకృష్ణ, భాస్కరప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సూచనల మేరకు రథసప్తమి ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి: ఫిబ్రవరి 2, 3, 4వ తేదీల్లో జరగనున్న రథసప్తమి రాష్ట్ర పండుగ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని, స్థానిక భక్తులు ఇచ్చిన సూచనల ప్రకారమే దాదాపుగా ఏర్పాట్లు చేస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం భక్తుల నుంచి సలహాల స్వీకరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి జిల్లా కేంద్రం నలుమూలలా సంబరాల కాంతులు, వెలుగులు కనిపించాలన్నారు. ఫిబ్రవరి 2న శోభాయాత్రతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 3న ఆలయంలో సౌరహోమం, 4న సప్తమి అభిషేక దర్శనాలుంటాయని వివరించారు. దాతల పాసులకు ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జిల్లా చరిత్రను తెలిపేలా లేజర్‌షో ఏర్పాటు చేస్తున్నామని, డచ్ భవనం వద్ద హెలికాప్టర్‌ను వినోద ప్రదర్శన కోసం ఉంచుతామని చెప్పారు. జిల్లా సంప్రదాయాలను తెలియజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు నిర్వహించాలని సూచించారు. అంతకుముందు పలువురు భక్తులు, స్థానికులు తమ అభిప్రాయాలను, సూచన, సలహాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఈవో వై.భద్రాజీ, డీఆర్‌వో వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, టీడీపీ నేతలు ఉంగటి రమణమూర్తి, ఉంగటి పాపారావు, తెలుగు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బలగలో ధనుర్మాస మేలుకొలుపులు



భజన చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: బలగ హరేరామ మందిరం సభ్యులు గురువారం ఉదయం మేలుకొలుపులు నిర్వహించారు. భజన గీతాలు ఆలపిస్తూ వీధుల్లో కలియతిరిగారు. ఇంటింటా సేకరించిన బియ్యం, సామగ్రితో ధనుర్మాసం పూర్తయ్యాక అన్నదానం నిర్వహిస్తారు.

ప్లాస్టిక్ కవర్లు కఠిన చర్యలు



ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చికెన్ షాపులు, టీ, టిఫిన్, కిరాణా తదితర దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తప్పవని నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ టి.సుధీర్‌కుమార్ హెచ్చరించారు. గురువారం నగరంలోని పెద్దమార్కెట్‌లో పలు దుకాణాల్లో 400 కేజీలు నిషేధిత ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా పట్టించుకోకపోవడం తగదని, ఇదే పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూ సమస్యలకు పరిష్కారం

ఎచ్చెర్ల: ప్రభుత్వం చేపడుతున్న భూసర్వేల ద్వారా గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని లావేరు తహశీల్దార్ వై.జోగారావు అన్నారు. గురువారం రేగపాలెంలో భూముల రీసర్వే సందర్భంగా రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్ఎస్ డీటీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రంగనాథునికి విశేష అలంకరణ



ఫరీదుపేటలోని రంగనాథస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం 18వ పాశురం చదివి వినిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

-ఎచ్చెర్ల క్యాంపస్

దేవీ ఆశ్రమంలో పూజలు



కొంచాలకూర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో పీఠాధిపతి బాలభాస్కర శర్మ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాకుళం వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బాలమురళీ కృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

పగలే వెలుగులు



లావేరు మండలం బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై విద్యుత్ లైట్లు పట్టపగలే వెలుగులు చిమ్ముతున్నాయి. నిత్యం ఇదే పరిస్థితి ఉంటున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. పగటి పూట విద్యుత్ వృథా అవుతుండటంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- ఎచ్చెర్ల

అరసవల్లిలో టీటీడీ చౌల్ట్రీ కూల్చివేత

- టూరిజం డార్మిటరీలో అన్నప్రసాదాల వితరణకు ఏర్పాట్లు



టిటిడి ఛౌల్ట్రీని కూల్చివేస్తున్న దృశ్యం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో ముందుగా పురాతన భవనాల కూల్చివేత పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల ప్రకారం ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో టీటీడీ చౌల్ట్రీ(ధర్మశాల)ని కూల్చివేశారు. 1972లో ఈ భవనం నిర్మించారు. వివాహాలతో పాటు భక్తులకు వసతి గదులను కూడా ఇందులోనే ఇచ్చేవారు. పూర్తి రాతికట్టు గల ఈ భవనాన్ని తొలిగించి ఆలయం ఎదురుగా ఎలాంటి అడ్డు లేకుండా ఇంద్రపుష్కరిణి కనిపించేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కూల్చివేత పనులు చేపడుతున్న దృష్ట్యా..నిత్యాన్నదాన భవనంలో అన్నదాన ప్రసాదాన్ని బఫే విధానంలో గురువారం అందజేశారు. ఇకపై శుక్రవారం నుంచి టూరిజం డార్మిటరీ భవనం, వైజయంతి ఉత్సవ వేదిక మండపంలో నిత్యాన్నదాన ప్రసాదాన్ని అందజేసేలా చర్యలు చేపడుతున్నారు.

జాయింట్ ఎల్‌పీఎం సమస్య పరిష్కరించాలి



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

గార: భూములకు సంబంధించిన జాయింట్ ఎల్‌పీఎంల సమస్య పరిష్కరించాలని గార మండలం రామచంద్రాపురం సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి కోరారు. డిప్యూటీ తహశీల్దార్ కె.రామారావు ఆధ్వర్యంలో పంచాయతీలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భూసర్వే వేగంగా చేపట్టడంతో తప్పులు దొర్లాయని, జాయింట్ ఖాతాలు ఎక్కువగా ఉండిపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. అనంతరం డీటీ మాట్లాడుతూ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కోసం ప్రభుత్వం జీవో ఇచ్చిందని, రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అంబటి చక్రధరరావు, మాజీ సర్పంచ్ అంబటి చినబాబు, ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు, ఆర్ఐ దివిలి సంజయ్, మండల సర్వేయర్ మెట్ట శ్రీరామమూర్తి, వీఆర్‌వో నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటలకు మడ్డువలస నీరివ్వాలి



మాట్లాడుతున్న పేడాడ శ్రీరామమూర్తి

జి.సిగడాం: రబీ మొక్కజొన్న పంటకు మడ్డువలస సాగునీరు అందించాలని వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామమూర్తి, ధవళపేట, ఆనందపురం గ్రామాల సర్పంచ్‌లు వడిశ మహేశ్వరరావు, చిత్తిరి మోహన్ కోరారు. గురువారం ఆనందపురంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో చుక్కనీరు అందించలేదని, అధికారులు స్పందించి కనీసం రబీ సీజన్‌లోనైనా నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సీజన్‌లో ఆనందపురం, ధవళపేట, గేదెలపేట, నక్కపేట, సీతంపేట, మానంపేట, పెంట, నాగులవలస, పాలఖండ్యాం, టిడివలస, సంతవురిటి, ఆబోతులపేట, నిద్దాం, మెట్టవలస, విజయరాంపురం, సీతారాంపురం, జగన్నాథపురం గ్రామాల్లో 6 వేల ఎకరాల మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు వివరించారు.

పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తగదు

జి.సిగడాం: గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై నాయకుల ఒత్తిడి, పనిభారం పెంచడం తగదని గ్రామ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు తులసీప్రసాద్ సాహు, ఏర్నేన జ్యోతి శ్రీనివాస్ అన్నారు. గురువారం జి.సిగడాంలో నిర్వహించిన కార్యవర్గం సమావేశంలో వారు మాట్లాడుతూ సచివాలయంలో వివిధ శాఖలకు సంబంధించిన సిబ్బంది ఉన్నా.. వారి పని కూడా పంచాయతీ కార్యదర్శులను చేయమనడం భావ్యం కాదన్నారు. సమావేశంలో పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

పతకమే లక్ష్యంగా సాధన చేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడల్లో ఉజ్వలమైన భవిష్యత్తును అందిపుచ్చుకునేందుకు 2025 ఏడాదిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని, పతకమే లక్ష్యంగా సాధన చేయాలని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో బాస్కెట్‌బాల్, సెపక్‌తక్ర, వెటరన్ క్రీడాకారులకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అంకితభావం, పట్టుదలతో శ్రమించి పాత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి, వెటరన్ అంతర్జాతీయ అథ్లెట్ ఎండీ కాసింఖాన్, శశి, కొర్లయ్య, రవి, గణేష్, లవకుమార్, బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్,పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల 33/11 సబ్ స్టేషన్ లైన్ల నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కేశవరావుపేట, ఫరీదుపేట, ఎస్ఎంపురం, లింగాలపేట గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.